క్లుప్తంగా

ఈవీఎంల పనితీరుపై అవగాహన



ఈవీఎంల గురించి వివరిస్తున్న ఆర్‌ఐ సురేష్‌కుమార్

గోపాలపట్నం: ఓటు ఏవిధంగా వేయాలి.. ఈవీఎంలు ఎలా పనిచేస్తాయన్న అంశాలపై గోపాలపట్నం రెవెన్యూ అధికారులు సోమవారం వెంకటాపురం మూడు గుడులు వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌ఐ సురేష్ తదితరులు ఈవీఎం, వీవీప్యాడ్, కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్‌ల గురించి, పని చేసే విధానాన్ని వివరించారు. సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది , స్థానికులు పాల్గొన్నారు.

శభాష్ ట్రాఫిక్ పోలీస్



మల్కాపురం వద్ద రోడ్డుపై గుంత పూడ్చి వేయిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ అప్పారావు

మల్కాపురం: శ్రీహరిపురం నుంచి నౌసేనాభాగ్ వరకు సర్వీసు రోడ్డులో పలు చోట్ల ఏర్పడిన గుంతలను మల్కాపురం ట్రాఫిక్ ఎస్‌ఐ అప్పారావు దగ్గరుండి పూడ్చి వేయించారు. సోమవారం ఉదయం మల్కాపురం,హెచ్‌పీసీఎల్,కల్యాణి ఆస్పత్రి ఏరియాల్లో రంధ్రాలను పూడ్చారు. ట్రాఫిక్ ఎస్‌ఐ అప్పారావు మాట్లాడుతూ రంధ్రాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని,వాటిని నివారించేందుకు గోతులు పూడ్చామన్నారు.

వేడుకగా జనతా మహిళా సేవా సంఘం వార్షికోత్సవం



కేక్ కట్‌చేస్తున్న మహిళలు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు జనతా కాలనీకి చెందిన జనతా మహిళా సేవా సంఘం 20వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. జనతా కాలనీలో మౌలిక వసతులు కల్పించడంలో కీలక భూమిక పోషించామని సంఘం అధ్యక్షురాలు విమల అన్నారు. స్థానిక నాయకుల దృష్టికి సమస్యలు తీసుకు వెళ్లి సుమారు రూ.2 కోట్ల వ్యయంతో రోడ్లు, కాల్వలు, మంచినీరు, విద్యుత్ వంటి సదుపాయాలు వచ్చేలా చేశామన్నారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షురాలు కేకే లక్ష్మి, మాజీ ప్రధాన కార్యదర్శి కె. శ్రీదేవి, బలివాడ రమా కుమారి, బి. వెంకటలక్ష్మి, భారతి, డి. శివలక్ష్మి, జ్యోతి ప్రభ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

300 మందికి అన్నసమారాధన



అన్నసమారాధన ప్రారంభిస్తున్న బిల్వపత్ర ట్రస్ట్ ప్రతినిధులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు సుసర్ల కాలనీ పార్వతీ చంద్రమౌళేశ్వర స్వామి వారి ఆలయం వద్ద బిల్వపత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. ట్రస్టు ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న నారాయణ సేవలో భాగంగా 300 మందికి అన్నప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో ఉమా మహేశ్వరస్వామి వారి ఆలయ కమిటీ అధ్యక్షులు ఇచ్ఛాపురపు నాగేంద్ర, సీతారామరాజు కాలనీ అధ్యక్షులు శ్రీనివాసరాజు, భరత్, విఠల్, బిల్వపత్ర సేవాదళ్ సభ్యులు ఎంవీవీ రవిశంకర్, కుమార స్వామి, సీతారామయ్య, మణి, వెంకటరామారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు
ఆపన్న హస్తం



1962 సంచార వాహనం



ఇది కదా అభివృద్ధి

కాకాని నగర్ రహదారిపై ఉన్న లేగదూడను ఓ వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. గిలా గిలా కొట్టుకుంటున్న ఆ మూగజీవిని అటుగా వెళ్లే ఓ ప్రయాణికుడు చూసి, టక్కున 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేశాడు. అంతే...కొద్ది సేపటికే అక్కడికి వాహనంతో పాటు వాలిపోయిన వైద్య బృందం ఆ లేగదూడకు వైద్యం అందించారు. దీంతో అక్కడ నుంచి లేచిన ఆ లేగదూడ పరుగులంకించుకుంది. సమయానికి వైద్యం అందకుంటే లేగదూడ మృత్యువాత పడేదని దాని పెంపకం దారుడు అప్పలనాయుడు ఆందోళన అంతలోనే మాయమైంది. 1962 సర్వీసు మా లేగదూడ పాలిట దేవుడిలా వచ్చిందని ఆనందంతో సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపాడు.

విశాఖ విద్య: ప్రజలకే కాదు...మూగ జీవాల ప్రాణ రక్షణకు సైతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా 1962 వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఒక్క ఫోన్ కాల్‌తో వాహనంతో పాటు వైద్యులు, సిబ్బంది హుటాహుటిన వెళ్లి మూగజీవాలకు అత్యవసర వైద్య సేవలు అందించి, వాటిని ప్రాణాపాయం నుంచి బయటపడేలా విశేష సేవలు అందిస్తున్నారు. ఈ సేవలపై మూగజీవాల పెంపకం దారులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గోపాలపట్నం ప్రాంతీయ పశువైద్యశాల



పాడిగేదెకు వైద్యం చేస్తున్న డాక్టర్



వైద్యం కోసం పెంపుడు కుక్కలను ఆస్పత్రికి తీసుకొచ్చిన పెంపకం దారులు

అందుబాటులో నాలుగు వాహనాలు

గోపాపట్నం ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలో నాలుగు 1962 వాహనాలు సేవలు అందిస్తున్నాయి. పశువులకు సకాలంలో వైద్యం చేసేందుకు వీలుగా పెందుర్తి, పరవాడ, గాజువాక, పెద గంట్యాడ కేంద్రాలుగా వాహనాలు అందుబాటులో ఉంచారు. వాహన డ్రైవర్‌తో పాటు, ఒక వైద్యుడు, సహాయకుడు సేవలు అందిస్తున్నారు.108 సర్వీసుల మాదిరే 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఎవరైనా ఫోన్ చేస్తే, కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి అందుకునే సమాచారంతో వైద్య బృందం సంఘటనా స్థలానికి చేరుకొని మూగజీవాలకు వైద్య సేవలు అందిస్తున్నారు. మూగజీవాల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేకంగా 'సంరక్షణ కార్డులు' సైతం పంపిణీ చేశారు. అనేక మందికి జీవనోపాధికి ఆధారంగా నిలిచే పాడి గేదెల సంరక్షణ కోసం పటిష్టమైన చర్యలు చేపట్టారు.



పాడిగేదెకు వైద్యం చేస్తున్న సిబ్బంది

మూగజీవాలకు ఆరోగ్య నేస్తం

మూగజీవాల ప్రాణ రక్షణ కోసం ఏర్పాటు చేసిన 1962 వాహనాలు ప్రస్తుతం గ్రామాల్లో ఆరోగ్య నేస్తంగా మారిపోయాయి. సంచార పశు వైద్య సేవ ద్వారా ప్రాణాంతకమైన వ్యాధులకు సైతం చికిత్సలు అందిస్తున్నారు. పాముకాటు గురైన పశువులకు సత్వర వైద్యం అందిస్తుండడంతో మూగజీవాలు ప్రాణాపాయం నుంచి బయటపడుతున్నాయి. అవసరమైన మందులు, అదే విధంగా వ్యాక్సినేషన్ భద్రపరిచేందుకు వాహనంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వ్యాక్సిన్ స్టోరేజీ కోసం ప్రత్యేకంగా ఫ్రీజర్ బాక్సులు సైతం అమర్చారు. దీంతో 1962 సర్వీసు మూగజీవాల పాలిట ఆరోగ్య నేస్తంగా మారింది.

- 1962 సర్వీసుతో ఆరోగ్య రక్షణ
- అత్యవసర చికిత్సపై ప్రత్యేక ఫోకస్
- వైఎస్సార్ సంచార పశువైద్యంతో సత్ఫలితాలు
- ఒక్క ఫోన్ కాల్‌తో గ్రామాలకు వెళ్తున్న సిబ్బంది
- గోపాలపట్నం ప్రాంతీయ వైద్యశాల పరిధిలో 4 వాహనాలు
- ప్రతీ వాహనంలో వైద్యుడు, సిబ్బంది విధులు
- ఉచితంగా మందులు, వ్యాక్సినేషన్
- సంరక్షణ కార్డుల అందజేత

సేవలు విస్తృతం



ప్రభుత్వ లక్ష్యం మేరకు 1962 సర్వీసుల ద్వారా సేవలు విస్తృతం చేస్తున్నాం. టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చే సమాచారం మేరకు వైద్యులు, సిబ్బంది అప్రమత్తతో గ్రామాలను సందర్శిస్తున్నారు. అందిస్తున్న సేవల్లో పారదర్శకత చాటుకునేలా అంతా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. మూగజీవాలు, రైతులు, గ్రామాల ఇలా సమస్త సమాచారం పొందుపరిచి, సేవలు అందిస్తున్నాం.

–డాక్టర్ రవికుమార్, డిప్యూటీ డైరెక్టర్, గోపాలపట్నం, పశువైద్యశాల

ఫోన్ చేస్తే చాలు వస్తున్నారు



ఇంటి వద్దనే పాడిగేదెలు పెంచుతున్నాం. పశువులకు ఏదైనా ఆరోగ్య పరమైన సమస్య వస్తే, గతంలో అయితే ప్రైవేటు వైద్యులను ఆశ్రయించేవాళ్లం. కానీ ఇప్పుడు ఫోన్ చేస్తే చాలు 1962 వాహనంతో వైద్యులు ఇంటికి వచ్చి మా పశువులకు వైద్యం చేస్తున్నారు. ఇప్పటి వరకు నాలుగు సార్లు కాల్ సెంటర్‌కు ఫోన్ చేశాను. ఫోన్ చేసిన వెంటనే వస్తున్నారు. పశువులకు మెరుగైన వైద్యం అందించడం గొప్ప విషయం.

– నమ్మి చంద్రశేఖర్, బుచ్చిరాజుపాలెం

మూగజీవాలకు ఆరోగ్య భరోసా



మనుషులకే కాదు, పశువులు, పెంపుడు జంతువులకు కూడా మెరుగైన వైద్యం అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుంటుంది. గత టీడీపీ ప్రభుత్వం పశువైద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. మూగ జీవాలను కూడా కాపాడాలని ప్రస్తుత ప్రభుత్వం సంచార వాహనాలను అందుబాటులోకి తీసుకురావడం గొప్ప విషయం. దీంతో అత్యవసర వేళలో పాడి రైతులకు సకాంలో సేవలు అందుతున్నాయి.

– టీఎస్. కృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- అందుకే ఆయనే మళ్లీ రావాలని నాయకుల పిలుపు
- 91, 59, 63 వార్డుల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్'



91వ వార్డు సచివాలయంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న బెహరా భాస్కరరావు



63వ వార్డు కార్యక్రమంలో మాట్లాడుతున్న బద్రీనాథ్



59వ వార్డులో డిజిటల్ బోర్డును ప్రారంభిస్తున్న సురేష్ యాదవ్, నాయకులు

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని, అందుకే ఆయనే మళ్లీ రావాలని జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. 91వ వార్డు 480 సచివాలయం వద్ద సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడి సచివాలయంలో ప్రభుత్వ పథకాల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నారన్నారు. ఈ సచివాలయం పరిధిలో వివిధ పథకాల కింద రూ.6.33 కోట్లు మంజూరు చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షులు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివారావు, దేరెడ్ల సత్యనారాయణ, పసుపురెడ్డి వెంకటరమణ, భారతి, పూటపల్లి గోవిందు, నీలాపు శ్రీనివాసరెడ్డి, బలరామ్, జి.నాగరాజు, భరణి, కృపామణి, సత్యకళ, సీవో ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనే జగనన్న లక్ష్యం

సింధియా: సుపరిపాలనే లక్ష్యంగా అన్ని వ్యవస్థల్లోనూ మార్పులు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం చరిత్రాత్మక అవసరమని వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ అన్నారు. 63వ వార్డు క్రాంతినగర్ సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, వార్డు అధ్యక్షుడు సోమాధుల సురేష్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన పార్టీ జెండాను, సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బద్రీనాథ్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జగనన్నను మళ్లీ సీఎం చేసే విధంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. అనంతరం పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్లు, కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో భోగవిల్లి నాగభూషణం, పూండీ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను గెలిపించుకుందాం

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామని పశ్చిమ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్ పిలుపునిచ్చారు. 59వ వార్డు నెహ్రూ నగర్ సచివాలయ పరిధిలోని హనుమాన్‌నగర్‌లో వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ నేతృత్వంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ నాలుగున్నరేళ్ల సంక్షేమ పాలనపై ప్రజలంతా ఆలోచించి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వలంటీర్లు, గృహసారథులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మానస

విశాఖ విద్య: గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ వైద్యురాలు నమ్మి మానస అన్నారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్(పీఎంఎస్‌ఎంఏ) కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మానస వారికి వైద్య పరీక్షలు చేసి, ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలన్నారు. కాన్పు అయ్యేంత వరకు ప్రతీ నెలా క్రమం తప్పకుండా ఆస్పత్రికి వచ్చి తగిన వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్య పరంగా ఏదైనా సమస్య ఎదురైతే, సచివాలయంలోని ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ బి. వరలక్ష్మి, సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి



శంకర్, క్రైం ఎస్‌ఐ

మల్కాపురం: నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నేర నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు క్రైం ఎస్‌ఐ పి.డి.బి.శంకర్ తెలిపారు. క్రిస్మస్, న్యూయర్, సంక్రాంతి పండగలు నేపథ్యంలో దొంగతనాలు జరిగే అవకాశమున్నందున స్థానిక ప్రజలు, వ్యాపారులు అప్రమత్తమంగా ఉండాలని సూచించారు. దూరప్రాంతాలకు వెళ్లే వారు ముందుగా పోలీస్ స్టేషన్‌లో సమాచారమివ్వాలని కోరారు. విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. నేర నియంత్రణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ మొబైల్‌లో ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని పోలీస్ సేవలను పొందాలన్నారు. మహిళలు విలువైన ఆభరణాల ధరించి వాకింగ్‌కు వెళ్లరాదని సూచించారు. ఎటువంటి నేరం జరిగిన వెంటనే పోలీస్ స్టేషన్ క్రైం విభాగం ఫోన్ నంబర్ 94409 04329కి గానీ, 100 గానీ కాల్ చేసి సమాచారం అందించాలని ఎస్‌ఐ శంకర్ కోరారు.

శంభో శంకర



విశాఖ విద్య: కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో శివాలయాలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఎన్‌ఏడీ సెంటర్ పరిసర కాలనీల్లోని ఆలయాల్లో శివనామస్మరణం మార్మోగింది. శంభో శంకరా అంటూ భక్తులు స్వామి సేవలో తరించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ వద్ద గల ప్రమథ ఉమా విశ్వేశ్వర కుమార స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం జరిపించారు. భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. దేవదాయ శాఖ గ్రూప్ ఆలయాల ఈవో పీఎస్‌ఎన్ మూర్తి, ఆలయ కమిటీ అధ్యక్షుడు గొంతిన రామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

– సీతారామరాజు నగర్(సుసర్ల కాలనీ)లోని శ్రీ పార్వతీ చంద్రమౌళీశ్వర స్వామి వారి ఆలయంలో క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇచ్ఛాపురపు నాగేంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



సుసర్ల కాలనీలో అభిషేకంలో పాల్గొన్న భక్తులు

మార్మోగిన శివ నామస్మరణ

గోపాలపట్నం: గోపాలపట్నం, నందమూరినగర్, పద్మనాభనగర్ కొత్తపాలెం ప్రాంతాల్లోని శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు క్షీర, పంచామృతా, రుద్రాభిషేకాలు చేశారు. గోపాలపట్నం శ్రీ పార్వతీ చంద్రమౌళీశ్వరాలయంలో రుద్రాభిషేకాలు జరిపారు. ఆలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి.

శివాలయంలో కార్పొరేటర్ల పూజలు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు సింధియా న్యూకాలనీలోని శివాలయంలో శ్రీను పంతులు ఆధ్వర్యంలో కార్తీక మాస చివరి సోమవారం పూజలు నిర్వహించారు. 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా కుటుంబ సభ్యులతో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్లను శ్రీను పంతులు శాలువాతో ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

అనధికార నిర్మాణాన్ని అడ్డుకుంటాం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గ్రామకంఠం స్థలంలో స్థానిక నగరాల సంఘం వారు చేపట్టిన అనధికార నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకుంటామని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు. మల్కాపురం గొల్ల వీధిలో విజ్ఞాన మండలి యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం అనధికార నిర్మాణంపై గ్రామంలోని 16 కుల సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 16 కులాలకు చెందిన విలువైన స్థలంలో నగరాల సంఘం వారు తమ సంఘం కోసం కల్యాణ మండపం నిర్మించడం సరికాదన్నారు. గ్రామకంఠ స్థలం గ్రామానికి ఉపయోగపడాలే తప్పా.. ఏ ఒక్క కుల అవసరాలకు కాదని పేర్కొన్నారు. ఈ నిర్మాణంపై ఇప్పటికే స్పందనలో ఫిర్యాదు చేశామన్నారు. అయినా వారు నిర్మాణాన్ని కొనసాగిస్తే మిగిలిన కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులతో కలిసి అనాధికార నిర్మాణం వద్ద దీక్ష చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యాదవ, అగ్నికుల క్షత్రియ, నాయీ బ్రాహ్మణ, రజక, శెట్టిబలిజ, ఎస్సీ కులాలకు చెందిన ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

రజక కాలనీలో వనభోజనాలు



అన్నప్రసాదం వితరణ చేస్తున్న గోపాలకృష్ణ

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం రజక కాలనీలో సోమవార కార్తీక వన భోజనాలు ఘనంగా నిర్వహించారు. 89వ వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ పాల్గొని అన్న ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో రజక కాలనీ పెద్దలు తంగేటి అప్పారావు, గోగుల మతం బాబూరావు, సీరందాసు పరదేశి, సీరందాసు బుజ్జి, టిక్కం శేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా ఐఎన్‌ఏఎస్ 333 వార్షికోత్సవం



కేక్ కట్‌చేస్తున్న నేవీ అధికారులు (ఇన్‌సెట్) ఈగల్ హెలికాప్టర్

గోపాలపట్నం: ఐఎన్ఎస్ డేగాలో నేవల్ ఎయిర్ స్క్వాడ్రన్(ఐఎన్ఏఎస్) 333 ఈగల్స్ 43వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ హెలికాప్టర్ 1980లో ఇండియన్ నేవీలో చేరింది. 2000 సంవత్సరం నుంచి విశాఖపట్నం ఐఎన్ఎస్ డేగాలో సేవలందిస్తోంది. ఐఎన్ఏఎస్ 333 నేవీలో చేరి 43 ఏళ్లు అయిన సందర్భంగా ఐఎన్ఎస్ డేగాలో నేవీ అధికారులు కేక్ కట్ చేశారు. అనంతరం హెలికాప్టర్ పనిచేసే విధానాన్ని వివరించారు.

డివైడర్ పైకి దూసుకుపోయిన కారు

మల్కాపురం: నగరం నుంచి డాక్‌యార్డ్ వైపు వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకుపోయింది. ఈఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు జరగలేదు. వివరాలు.. నగరానికి చెందిన చంపక్‌లాల్ అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం రాత్రి 8 గంటల సమయంలో నగరం నుంచి సింధియా వైపు వస్తున్నాడు. డాక్‌యార్డ్ వద్ద డివైడర్‌ను లాల్ గుర్తించలేక దానిపై నుంచి కారు నడిపాడు. ఈ ఘటనలో టైరు రాపిడికి గురై పేలిపోయింది. ఆ మార్గం నుంచి వస్తున్న వారి సాయంతో కారును డివైడర్ నుంచి తప్పించే యత్నం చేశాడు. ఫలితం లేకపోవడంతో కారును అక్కడే నిలిపివేశారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు ప్రమాదంపై విచారణ చేపట్టారు.

మిస్టర్ విశాఖ బాడీ బిల్డింగ్ విజేత భాస్కరరావు



చాంపియన్‌గా నిలిచిన బాడీబిల్డర్‌లతో నిర్వాహకులు

విశాఖ విద్య: మిస్టర్ విశాఖ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ విజేతగా గిడ్డి భాస్కర్ నిలిచారు. ఎన్‌ఏడీ కరాస ఆర్కే ఫిట్నెస్ మంత్ర జిమ్స్‌లో సోమవారం సెకెండ్ మిస్టర్ విశాఖ కోస్టల్ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్–2023లను నిర్వహించారు. పోటీలను పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు, నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి 120 మంది పోటీదారులు పాల్గొన్నారు. చాంపియన్‌గా గిడ్డి భాస్కరరావు , బెస్ట్ మస్కులర్‌గా హేమంత్ కుమార్, బెస్ట్ పోజర్‌గా పాల్గొణరావు నిలిచారు. సబ్బవరం ఎంపీపీ, మధురం డెవలపర్స్ ఎండీ రాపేటి రాము, రాజాన నాయుడు, ఆదిత్య నాయుడు చేతుల మీదగా విజేతలకు బహుమతులను అందజేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లా కృష్ణ, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్, జిమ్ నిర్వాహకులు గున్న రామకృష్ణారావు, కోటిరెడ్డి, కోన శ్రీను, కంచరపు శ్రీనివాస్, డీవీ తదితరులు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వారిని అభినందించారు.